క్లుప్తంగా

వైభవంగా పల్లకీ సేవ



పల్లకోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌కు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం చేసి పట్టువస్త్రాలచే అలంకరించి మహా మంగళ హారతులు చేపట్టారు. సాయంత్రం స్వాతి పల్లకీ సేవ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి.. పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ఆవరణలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధుసూదనరాయలు, లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి, మద్దిలేటి రెడ్డి, పుష్పావతి పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయాన్నే ఆయా గ్రామాల్లో ఆలయాలకు చేరుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కృష్ణా బోర్డు ఏర్పాటుపై రేపు సమావేశం

నంద్యాల(అర్బన్): కృష్ణానది యాజమాన్య బోర్డు ఏర్పాటుపై ఈనెల 9వ తేదీన స్థానిక వివేకానంద ఆడిటోరియంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణానది నీటి నిర్వహణ, వివాదాల పరిష్కారానికి రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కృష్ణానది యాజమాన్య బోర్డును ఏపీలో ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణానది నీటి సక్రమ నిర్వహణకు సీమ తాగునీటి హక్కుల పరిరక్షణకు అనుకూలమైన ప్రాంతంలో బోర్డు ఏర్పాటు అంశంపై జరిగే సమావేశానికి రైతు సంఘం నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రోత్సాహకాలను వినియోగించుకోండి

ఉయ్యాలవాడ: పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ తెలిపారు. శనివారం మండలానికి మంజూరైన 7 యూనిట్ల పెరటికోళ్లను పెంపకందారులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం శేఖర్, సీసీ గంగన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేగంగా పెట్రోల్ పంప్ నిర్మాణ పనులు

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. శనివారం సొసైటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి పనులను పరిశీలించారు. ఇక్కడ పెట్రోల్ పంప్ ఏర్పాటైతే వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. కోవెలకుంట్ల– నంద్యాల మధ్య కేవలం గోస్పాడు వద్ద మాత్రమే పంప్ ఉందని చెప్పారు. హిందూస్తాన్ సంస్థ సౌజన్యంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): నకిలీ సీడ్ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నకిలీ సీడ్ పత్తి విత్తనాల సాగుతో నంద్యాల జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దిగుబడులు రాక మధ్యలోనే రైతుల పంటలను దున్నేసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలను అందించిన సీడ్ కంపెనీలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని, నకిలీ విత్తన అంచనాకు వచ్చిన శాస్త్రవేత్తలు సైతం తేల్చకపోవడం అన్యాయమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): పులిమద్ది గ్రామంలో నున్న శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్యనిర్వాహక అధికారి నాగప్రసాద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలిగిన వారు ఏడుగురికి మించకుండా గ్రూపుగా పూర్తి చేసిన తమ దరఖాస్తులను జిల్లా దేవదాయ శాఖ అధికారి, రైతునగరం కార్యాలయంలో ఈనెల 25వ తేదీ లోపు సమర్పించాలని చెప్పారు. వివరాలకు ఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించడానికే గడప గడపకు..

రుద్రవరం: సమస్యల పరిష్కారం కోసం, మరింత మెరుగైన పాలన అందించేందుకు, పథకాల అమలు తీరును తెలుసుకునేందుకే గడప గడపకు కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో గడప గడపకు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుక రావాలని సూచించారు. సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్లు అందజేశారు. బడుగు బలహీనులకోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకవచ్చిన సీఎం జగనన్న మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అక్కడక్కడ ఎదురైన చిన్న చిన్న సమస్యలను అధికారులు, నాయకులతో మాట్లాడి వెంటనే పరిష్కరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పట్టణానికి చెందిన ప్రమీలమ్మకు రూ.55వేలు, అలమూరు గ్రామానికి చెందిన మురళి కాలేయ వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5లక్షలను మృతుడి భార్య పేరూరు సూర్యకుమారికి అందజేశారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, చంద్రారెడ్డి, కొల్లం పుల్లయ్య, గంగిశెట్టి మద్దిలేటయ్య, దేవగుడి జాకిర్, బైరీ హరి, నొస్సం వలి, చంద్ర, నాగేష్, గోపాల్‌రెడ్డి, రామిరెడ్డి, మహేష్‌రెడ్డి ,జయరాముడు, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

రైతులకు రాయితీ పంపిణీ

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీ పరిధిలోని పశుగ్రాస క్షేత్రాల పెంపకందారులకు రూ.5వేల చొప్పున 50 గ్రామాల పాల ఉత్పత్తుల సహకార సంఘాలకు రూ.6.57 లక్షలు చెక్కును డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం అందజేశారు. స్థానిక కార్యాలయంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ 136.7 ఎకరాల్లో ఏపీ బీఎన్ -1, కో-2, కో-3, సుపర్ నేపియర్, గని గడ్డి తదితర బహు వార్షిక పశుగ్రాస క్షేత్రాలను రైతులు పెంచారన్నారు. కార్యక్రమంలో ఎండీ పరమేశ్వరరెడ్డి, డీఎం రాజేష్ పాల్గొన్నారు.



పాడి రైతుకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

గృహ నిర్మాణాల్లో పురోగతి పెంచాలి

ఉయ్యాలవాడ: గృహ నిర్మాణాల్లో పురోగతి పెంచేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని ఆళ్లగడ్డ హౌసింగ్ డీఈ నాగరాజు అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని హరివరంలో గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా జగనన్న లేఅవుట్ కాలనీని మండల సమన్వయ కమిటీ ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేఖ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ షాదిక్‌బాషా, వీఆర్ఓ గోపాల్‌తో పాటు పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీలో గృహాలు నిర్మించుకునేందుకు 60 మందికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. అయితే నిర్మాణాలు ఇప్పటి వరకు చేపట్టకపోవడంపై లబ్ధిదారుల సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. డీఈ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 46 జగనన్న లేఅవుట్ కాలనీలకు 3,244 గృహాలు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో 1,446 మంది నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. సర్పంచ్ నడిపెన్న, మాజీ సర్పంచ్ తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, నాయకులు సూదుల దస్తగిరిరెడ్డి, ఎర్రి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



హరివరంలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ డీఈ నాగరాజు, అధికారులు

మురుగు సమస్యకు పరిష్కారం

రుద్రవరం: స్థానిక అగర్త సమీపంలోనున్న కాలనీలో ఏళ్లుగా మురుగు సమస్య వేధిస్తోంది. గ్రామంలోని ఎగువ భాగం నుంచి వచ్చే వృథా నీరంతా దిగువకు పారకుండా కాలనీ మధ్యలో నిల్వ ఉండి మురుగు కూపంలా మారింది. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానికులు సమస్యను వివరించారు. దీంతో ఆయన వెంటనే పరిష్కరించాలని పీఆర్,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటరాముడు ,ప్రమోద్‌ను ఆదేశించారు. స్పందించిన అధికారులు మేజర్ పంచాయతీ సర్పంచు బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు శనివారం కాలనీ మధ్యలోనున్న కంప చెట్లను తొలగించి నిల్వ ఉన్న మురుగు దిగువకు పారేలా కాల్వ తీయించి సమస్యను పరిష్కరించారు. మురుగు సమస్య తొలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



కాల్వ తవ్విస్తున్న దృశ్యం

వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి!

బొమ్మలసత్రం: నంద్యాల సర్వజన ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఏసేపు (55) శనివారం మృతి చెందాడని మృతుడి బంధువులు ఆరోపించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన ఏసేపు శుక్రవారం కడుపు ఉబ్బరం, ఆయాసంతో ఇబ్బంది పడుతుండగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే వైద్య సిబ్బంది పట్టించుకోలేదని వాపోయారు. ఉదయం 11 గంటల సమయంలో మృతిచెందాడని వైద్యులు నిర్ధారించటంతో బంధువులు ఆసుపత్రిలో ఆందోళన చేపట్టారు. సంఘటనపై వైద్య సిబ్బందిని వివరణ కోరగా.. రోగి పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లాలని చెప్పినా.. ఇక్కడే చికిత్స అందించాలని కోరడంతో చికిత్స అందించినా కోలుకోలేక మృతి చెందాడని చెప్పారు.

చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మరు

- బ్రాహ్మణపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): తాను అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు అందజేయకుండా, అభివృద్ధి పనులు చేపట్టకుండా ప్రజలను నట్టేట ముంచిన చంద్రబాబు మాటలను జనం నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న జగనన్న పాలన తీరును టీడీపీ పాలనతో పోల్చుకొని ఎవరు ప్రజలకు మేలు చేశారో గుర్తించాలని చెప్పారు. గతంలో ప్రజలను కేవలం ఓటర్లు మాత్రమే చూసేవారని, ఎన్నికల సమయంలో ఇష్టారీతిన హామీలు గుప్పించి ఓట్లు కొల్లగొట్టి, అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకపోగా కల్లబొల్లి మాటలతో మభ్యపెట్టారని మండిపడ్డారు. కానీ ప్రస్తుతం ఇచ్చిన హామీల్లో 96 శాతం నెరవేర్చి, అర్హులందరికీ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే చెందుతుందన్నారు. పథకాల వర్తింపు పేరుతో మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిప్పుకోవడాలను అరికట్టడానికే గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఇంటి ముంగిటకే సేవలందేలా చర్యలు చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముక్కెర సుదర్శన్‌రెడ్డి, నాయకులు, అడ్వకేట్ కృష్ణారెడ్డి, ప్రద్యున్నరెడ్డి, తేజారెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

పాదయాత్రగా తిరుమలకు

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన గణేష్ మిత్ర బృందం సభ్యులు కరోనా మహమ్మారి నుంచి ప్రజలను కాపాడాలని లోక కల్యాణం కోసం శనివారం నంద్యాల నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. బృంద సభ్యులు రజనీకాంతరెడ్డి, చలంబాబు, నిమ్మకాయల సుధాకర్ తదితరులు 16 మంది కాలినడకన బయలుదేరారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయండి

రుద్రవరం: మన బడి నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజనం, పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని శనివారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని లే అవుట్ ఇళ్ల స్థలాలను పరిశీలించి గృహ నిర్మాణాలు వెంటనే చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. గృహ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు లబ్ధిదారులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహించాలని చెప్పారు. పీఆర్ ఏఈ వెంకటరాముడు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నంద్యాల(అర్బన్): టిడ్కో గృహాల సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు గృహాలను అందించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించిన తర్వాత గృహాలు అందజేస్తే ప్రజలకు ఇబ్బందులుండవన్నారు. అసౌకర్యాలతో ఆతృతగా పంపిణీ చేస్తే అవస్థలు తప్పవన్నారు. నాయకులు సోమన్న, శ్రీనివాసులు, రవికుమార్, అజీజ్‌బాషా పాల్గొన్నారు.

పోరాటాలతో సమస్యల పరిష్కారం

నంద్యాల(అర్బన్): పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక నరసింహయ్య భవన్‌లో శనివారం సీపీఎం నంద్యాల జిల్లా శాఖ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏసురత్నం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రమేష్‌కుమార్ మాట్లాడుతూ పోరాటాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని, ప్రభుత్వం దిగివచ్చేంత వరకు కొనసాగించాలని చెప్పారు. పోరాటలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని కూడా భాగస్వాములను చేయాలన్నారు. నాయకులు నాగరాజు, నరసింహ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



మహిళలకు బహుమతులు అందజేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని బాలాజీ మర్చెంట్ కమిటీ కల్యాణ మండపంలో బాలాజీ మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, చిత్రకారులు కోటేష్, మాస్టర్ చిత్తలూరి రాంప్రసాద్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో 50మంది మహిళలను పాల్గొనగా ప్రథమ బహుమతి అయితా జయంతి, ద్వితీయ బహుమతి బి.శివశిరీష కిరణ్మయి సాధించారు., ప్రోత్సాహక బహుమతులు విజయలక్ష్మి, సరిత,నాగమణి అందుకున్నారు. కొశెట్టి కృష్ణమూర్తి, నారాయణ శ్రీనివాస్, చరణ్‌దాస్, మలిపెద్ది శ్రీకాంత్ పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి





పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి కోరారు. మార్చిలో జరిగే ఎన్నికల్లో గెలుపును కాంక్షిస్తూ శనివారం ఎమ్మెల్యే నివాసంలో పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంతకు ముందు ఎంపీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో బెస్త సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్, నాయకులు సన్నల సాయిరాంరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, పార్థసారథి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మైదానంలో స్టేడియం నిర్మాణం సరికాదు

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్టేడియం నిర్మించాలనే నిర్ణయం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా నంద్యాలలో రూ.50 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్టేడియం నిర్మాణానికి అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యార్థులు, యువకులు వివిధ రకాల ఉద్యోగాల కోసం వ్యాయామ శిక్షణతో పాటు జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించుకోవడానికి మైదానం ఉపయోగపడుతుందన్నారు. స్టేడియం నిర్మిస్తే వీటికి ఆటంకం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో అనువైన ప్రాంతంలో స్టేడియం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు కిరణ్, సుమంత్, మహేష్, గోపాల్, సాయి పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

ఆళ్లగడ్డ: హత్యాయత్నానికి ప్రయత్నించిన ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. పట్టణానికి చెందిన అశోక్, వెంకటసుబ్బయ్య, మల్లికార్జున ప్రధాన రహదారిపై కొందరు వ్యక్తులు దాడి చేసి హత్య చేసేందుకు యత్నించారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. విచారణలో భూపతిరాజు, భూమా జగన్, నరేష్, వంశీకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, గాలి పోతుల సుబ్బరాయుడును నిందితులుగా గుర్తించారు. శనివారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించడంతో కడప సెంట్రల్ జైలుకు తరలించామని వివరించారు.

హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే

ఆళ్లగడ్డ: ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు సలోమి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆమె కార్యాలయ అధికారులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఎస్సీలకు ప్రత్యేక శ్మశాన వాటికల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం శుభపరిణామమన్నారు. గ్రామ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రతి నెల 30వ తేదీ సివిల్ రైట్స్ డే నిర్వహించాలని చెప్పారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. డీటీ రవి ఉన్నారు.



తహసీల్దార్ హరినాథరావుకు వినతి పత్రం అందజేస్తున్న సలోమి

బాధ్యతగా పనిచేయాలి

ఆళ్లగడ్డ: గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డీఎల్‌డీఓ జనార్దనరావు సూచించారు. మండలంలోని ఎస్.లింగందిన్నె గ్రామ సచివాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి ఉన్నారు.



లింగందిన్నె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ జనార్ధనరావు

'ఖేలో ఇండియా'లో నమోదు చేసుకోండి

నంద్యాల(సిటీ): ఖేలో ఇండియాలో అన్ని పాఠశాలలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని నంద్యాల జిల్లాను అగ్ర స్థానంలో నిలపాలని డీఈఓ అనురాధ తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌కేఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియాపై ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. అనంతరం ఖేలో ఇండియా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలోని నంద్యాల, డోన్ డివిజన్‌లో ఉన్న దాదాపు 200 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారని వారికి శారీరకంగా ధృడంగా ఉండేందుకు పోషకాహారంపై అవగాహన కల్పించామన్నారు. క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి రమణారెడ్డి, శాప్ కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనాథ్, నంద్యాల జిల్లా ఆర్డినేటర్ రవికుమార్, జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి నాగేంద్ర, ఖేలో ఇండియా మండల కో ఆర్డినేటర్ భుజంగరావు పాల్గొన్నారు.

ఘనంగా రమణ మహర్షి జయంతి

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో వెలసిన సీతారామ ఆశ్రమంలో శనివారం రమణ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామతీర్థసేవ సత్సంగం ఆధ్వర్యంలో రమణ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి గీతా పారాయణం, పూజలు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): మండలంలోని పులిమద్ది గ్రామంలోనున్న శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్యనిర్వాహక అధికారి నాగప్రసాద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలిగిన వారు ఏడుగురికి మించకుండా గ్రూపుగా పూర్తి చేసిన తమ దరఖాస్తులను జిల్లా దేవదాయ శాఖ అధికారి, రైతునగరం కార్యాలయంలో ఈనెల 25వ తేదీ లోపు సమర్పించాలని చెప్పారు. వివరాలకు ఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



నాట్లు వేస్తున్న మహిళలు

జోరందుకున్న వరి నాట్లు

శిరివెళ్ల: మండలంలో రబీ వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. శ్రీశైలం డ్యాంలో పుష్కలంగా సాగునీరు ఉండడంతో కేసీ కెనాల్ కింద వరి పంట సాగు చేస్తున్నారు. కోటపాడు, వీరారెడ్డిపల్లె, కామినేనిపల్లె, వెంకటాపురం, వనికిదినిదిన్నెలో వంద శాతం వరి నాట్లు వేశారు. నాట్లు ఊపందుకోవడంతో కూలీలు, రైతులు బిజీగా ఉన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పొలాలు కూలీలతో నిండి ఉంటున్నాయి. అలాగే తెలుగుగంగ కింద తడుల ప్రకారం సాగునీరు ఇస్తామని అధికారులు చెప్పడంతో బోయలకుంట్ల, గంగవరం, చెన్నూరు గ్రామాల్లో బోర్లు, బావులు, చెరువుల కింద రైతులు వరి నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి దిగుబడి, ధర ఆశాజనకంగా ఉండడంతో రబీలో భాగంగా రెండో పంటగా రెట్టింపు ఉత్సాంతో వరినే సాగు చేస్తున్నారు. ఖరీఫ్లో ఎకరానికి 35 నుంచి 40 బస్తాల దిగుబడి రావడం, ధర కూడ 75 కేజీల బస్తా రూ.1600 ప్రకారం లభించడంతో రైతన్నల్లో సంతోషం నెలకొంది. రబీలో 6,523 హెక్టార్లలో వరి పంట సాగవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



వరి నారును కట్టలు కడుతున్న కూలీలు